
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

మంగళవారం 23 సెప్టెంబరు 2025 | 5



ఇజ్రాయెల్‌లో ఉద్యోగాల పేరుతో మోసం

- ఒక్కొక్కరి నుంచి రూ.8లక్షల వసూలు
- తప్పించుకునేందుకు చెల్లని చెక్కులు
- బాధితుల్లో కొందరు కోనసీమ వాసులు

7

ఆ లేఖతో మాకు సంబంధం లేదు

- మావోయిస్టు పార్టీ డివిజన్ కార్యదర్శి లచ్చన్న ప్రకటన

7

తిరుపతి-విశాఖ మధ్య 20 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు 7

పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు

రేపు జిల్లా స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక 6



కాకినాడ బాలాత్రిపురసుందరి ఆలయంలో క్యూలో భక్తులు

దసరా ఉత్సవాలు ప్రారంభం

- జిల్లావ్యాప్తంగా వైభవంగా దేవీశరన్నవరాత్రి వేడుకలు
- తొలిరోజు బాలాత్రిపుర సుందరిగా అమ్మవారి అలంకరణ

దేవీశరన్నవరాత్రులు జిల్లావ్యాప్తంగా భక్తుల కోలాహలం నడుమ సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవార్ల విగ్రహాలను సమీపంలోని కాల్వలు, గోదావరి వద్దకు తీసుకువెళ్లి భక్తులు స్నానాలు ఆచరించి ఆయా ప్రసిద్ధి చెందిన ఆలయాలతోపాటు ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన పందిళ్లలో అమ్మవారి ప్రతిమను అలంకరించి భక్తి, శ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఉత్సవాల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. సామర్లకోట, పిఠాపురంతోపాటు జిల్లాలోని వివిధ ఆలయాలు, ప్రత్యేక మండపాల్లో నవరాత్రులు ప్రారంభం కాగా.. తొలిరోజు అమ్మవారు బాలత్రిపురసుందరి అలంకరణలో జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాలతోపాటు పందిళ్లలో దర్శనమిచ్చారు.



విల్లంబుల అవతారంలో బాలాత్రిపురసుందరి అమ్మవారు

పన్ను తగ్గింపా.. పండుగ ఆఫరా..



కాకినాడలో ఓ షోరూమ్‌లో అమ్మకాలు

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ నుంచి సామాన్యులకు భారీ ఉపశమనం కలిగించిన విషయం తెలిసిందే. అయితే ఆ తగ్గింపు కొనుగోలుదారుకు లాభం చేకూర్చడం ఇప్పుడు చిక్కుముడిగా మారింది. జీఎస్టీ తగ్గక ముందు ఎంత ధర, తర్వాత ఏ మేరకు తగ్గిందనే విషయాలు దుకాణాల్లో ఎక్కడా కనబడడం లేదు. తొలిరోజు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో అయితే అంతా అయోమయమే కనిపించింది. అసలే అసలు ధరను అమాంతం పెంచేసి భారీ తగ్గింపును చూపిస్తుంటారు. ఇప్పుడు కూడా ఆ మాదిరిగానే ధరలు ఉండడంతో జీఎస్టీతో తమకు ఏమి ఒరిగిందో వినియోగదారుడికి బోధపడడం లేదు. ఇక మార్కెట్‌లోనూ దసరా పండుగ ఆఫర్లు ప్రారంభించేశారు. దీంతో జీఎస్టీ తగ్గింపు ఎంత మేర, పండుగ ఆఫరు ఎంత డిస్కౌంటు అనే అంశాలు కలగాపులగంగా మారిపోయాయి.

అంతా అయోమయం!





- దసరా ఆఫర్లో కొట్టుకుపోయిన జీఎస్టీ తగ్గింపు ధరలు
- ట్యాక్స్ ఎంత మేర తగ్గిందో షాపుల్లో చూపని వైనం
- కొన్నిచోట్ల పాత స్టాకు పేరుతో దోపిడీ
- తొలిరోజు మార్కెట్‌పై ప్రభావం నిల్

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ/సామర్లకోట/తుని - ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ తగ్గింపు ప్రభావం దసరా ఆఫర్ల మధ్య కనిపించకుండా పోయింది. వివిధ రకాల ఎలక్ట్రానిక్స్ గూడ్స్‌కు దసరా ఆఫర్లు ప్రకటించారు. సోమవారం నుంచి జీఎస్టీ 2.0 అమలులోకి వచ్చినా పెద్దగా ధరలు తగ్గినట్టు కనిపించలేదు. కొన్ని వస్తువులకు మొత్తం జీఎస్టీ తీసేయడంతోపాటు కొన్నింటికి 5 శాతానికి పరిమితం చేయడంతో ధరల్లో స్పష్టమైన తేడా కనిపించాలి. కానీ ఏ షాపుల వద్దా కనీసం తగ్గింపు బోర్డులు పెట్టలేదు. ప్రభుత్వం బోర్డులు పెట్టాలని ముందే స్పష్టం చేసింది కూడా. ఇక దసరా పండుగ ఆఫర్లలో ఎక్కువగా టీవీలు, ఏసీలు, వాషింగ్ మెషీన్లను ఏటా కొంటారు. వీటిపైనా జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించింది. గతంలో ఐదు స్లాబులుగా ఉన్న పన్నులను 5, 12 శాతాలతో రెండు స్లాబులకు తీసుకొచ్చింది. దీనిలో కార్ల నుంచి బిస్కట్ల వరకూ దాదాపు 375 వస్తువులను ఈ రెండు శ్లాబుల్లోకి తేగా, కొన్నింటికి సున్నా చేసింది. అయితే ఆ మేరకు వినియోగదారుడికి ఎంత లబ్ధి చేకూరిందో ఏ వస్తువుపై కూడా ఉండడం లేదు. ఉదాహరణకు ఆన్‌లైన్‌లో ఓ కంపెనీ 55 అంగుళాల ఎల్‌ఈడీ టీవీ ధర రూ.59,999గా చూపించి ఏకంగా రూ.30,001 రాయితీ ఇచ్చేస్తున్నారు. మరో కంపెనీ వాస్తవ ధరను రూ.73,990గా చూపించి ఏకంగా రూ.50 వేల డిస్కౌంటును ఇచ్చేస్తోంది. అసలు వాస్తవ ధర నిజమైనదేనా? జీఎస్టీ ఎంత తగ్గింది? పండుగ ఆఫరు ఎంత ఇచ్చారు? అనే అంశాలపై స్పష్టత కరువైంది. ఇక మార్కెట్‌లో కిరాణా తదితర సరుకుల విషయంలో కూడా ఇదే నడుస్తోంది. కొందరు వ్యాపారులు పాత స్టాకు, పాత ధరలకే హోల్‌సేల్‌గా కొన్నామంటూ ధరలు తగ్గించకపోవడం గమనార్హం. కార్లకు మాత్రం వారం రోజుల నుంచి రూ.50 వేల నుంచి లక్షకుపైగా తగ్గినట్టు చెబుతున్నారు. టీవీలు, ఏసీలకు రూ.1500 నుంచి 3 వేల మాత్రమే తగ్గినట్టు కొందరు వ్యాపారులు చెబుతున్నారు. ఈ ధరలు దసరా ఆఫర్ల కింద ముందుగా ప్రకటించినవే. మాల్స్‌లోనూ ఇదే పరిస్థితి. అధికార యంత్రాంగం కదిలితే జీఎస్టీ తగ్గింపు మార్పు కనిపించే అవకాశం ఉంది. చిల్లర దుకాణాల్లో అసలు బిల్లులు ఇవ్వరు కాబట్టి అసలు ధర ఎంతో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో మార్కెట్‌పై ప్రజలు ఎగబడడం వంటిదేమీ కనిపించలేదు. అయితే కాస్త స్పష్టత వచ్చాకే ఏదైనా కొనుగోలు చేయాలనే యోచనలో ఎక్కువ మంది వినియోగదారులు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో తొలి రోజు ప్రభావం ఏమీ లేదు.

ఒకటి రెండ్రోజుల్లో మారతాయి...

జీఎస్టీ తగ్గింపు ధరల్లో తొలిరోజు గందరగోళం నెలకొనగా, ఒకటి రెండ్రోజుల్లో దాని ప్రభావం ఉంటుందని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. వాస్తవానికి పాల ధరలు తగ్గిస్తున్నట్టు ఇప్పటికే చాలా కంపెనీలు ముందస్తుగా ప్రకటించాయి. అయితే మార్కెట్‌లో ఆ మేరకు తగ్గింపుతో కొందరు విక్రయాలు చేసినా, చాలాచోట్ల పాత ధరతోనే విక్రయించారు. ఇదేమని అడిగితే ప్యాకింగ్‌లో ఉండే మిస్టేక్ వల్ల సవరణ జరగలేదని అమలాపురంలో ఒక పాల వ్యాపారి చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో సవరణలు జరుగుతాయని సదరు కంపెనీ వారు చెప్పినట్టు తెలిపారు. వాస్తవానికి పాల ధర లీటరుకు రూ.2, నెయ్యి, పనీర్, బట్టర్ వంటి ఉత్పత్తులపై రూ.15 నుంచి రూ.30 మేర వస్తువును బట్టి తగ్గించారు. ఇక నిత్యావసర వస్తువులపై 18 శాతం ఉంచి ధరలను 5 శాతానికి తగ్గించినప్పటికీ కిరాణా, ఇతర ఉత్పత్తులపై ఇంకా తగ్గింపు అమలుచేసేందుకు వ్యాపారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. గతంలో తాము జీఎస్టీ చెల్లించి పూర్తిస్థాయిలో కొనుగోలు చేసిన వస్తువుల ధరలను తగ్గిస్తే నష్టపోతామనే భయంతో పాత రేట్లతోనే వసూలు చేస్తున్నారు. వెంటనే అధికారులు తనిఖీలకు సిద్ధం కాకపోతే ఇంకొంతకాలం పాత ఎమ్మార్పీలతో విక్రయించే అవకాశం ఉంది.

తగ్గితే పండగే..

జీఎస్టీ తగ్గింపుతో సుమారు 375 రకాల ఉత్పత్తులపై పన్ను రేట్లు తగ్గాయి. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, వాహన, ఎలక్ట్రానిక్, డెయిరీలు, పాల ఉత్పత్తులపైనా ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. సెలూన్లు, వ్యాయామ-యోగా కేంద్రాలపై, ఫేస్ పౌడర్, షేవింగ్ క్రీమ్, సబ్బుల వంటి వ్యక్తిగత సౌందర్య ఉత్పత్తులపై పన్ను 18 శాతం నుంచి 5 శాతం తగ్గింది. జీఎస్టీ తగ్గుదలతో ప్రతి కుటుంబానికి వేలాది రూపాయలు ఆదా జరుగుతుందని కేంద్రం చెబుతోంది. నిజానికి పూర్తిస్థాయిలో ధరల తగ్గింపు అమలు జరిగితే ప్రజలకు లాభదాయకమే.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ పురందేశ్వరి

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు : ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో పేదలు, మధ్యతరగతి వర్గాలకు మేలు జరుగుతుందని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శరన్నవరాత్రుల ప్రారంభం సందర్భంగా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని అమ్మవారిని సోమవారం ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ సరళీకృతం వల్ల ధరలు తగ్గి రైతులకు ఆదాయం పెరుగుతుందని చెప్పారు.

'వాహన మిత్ర'కు అర్హుల జాబితా సిద్ధం

- జిల్లాలో 14,953మంది అర్హులు
- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
- అక్టోబరు 1న బ్యాంకు ఖాతాలకు రూ.15వేలు
- ఆటోడ్రైవర్ల గృహాల్లో ఘనంగా దసరా సంబరాలు
- రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మరో పథకానికి శ్రీకారం

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మరో సరికొత్త పథకంతో ఆటో డ్రైవర్లు, మోటరు క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లపట్ల వరాల జల్లు కురిసింది. ఆటోడ్రైవర్ల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని వారికి ఆర్థికసాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అక్టోబరు 1న వారి బ్యాంకుఖాతాల్లో సొమ్ములు జమ చేయనుంది. జిల్లావ్యాప్తంగా 40వేలమంది వరకు ఆటోడ్రైవర్లు ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం అధికారులు దరఖాస్తులను స్వీకరించి వాటిలో 14,953 మందిని అర్హులుగా తేల్చారు. మరో 200 దరఖాస్తులను పరిశీలన నిమిత్తం అమరావతి పంపారు. వాటిలో కొన్ని దరఖాస్తులకు ఆమోదం లభించే అవకాశం ఉంది. రాష్ట్రంలో మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆ ప్రభావం ఆటోలపై పడి వారి జీవనోపాధిపై పెను ప్రభావం చూపింది. దీంతో ప్రభుత్వం ఆటో కార్మికులు ఆదుకోవాలని సంకల్పించింది. సరికొత్త పథకం వాహన మిత్రను రూపొందించింది. ఈపథకం ద్వారా ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం చేయనుంది. దీనికి పలు నిబంధలను విధించింది. ఆటో డ్రైవర్ తెల్లరేషన్‌కార్డు కల్గి ఉండాలని, ఇంటి విద్యుత్ వినియోగం నెలకు 300యూనిట్ల కంటే తక్కువగా ఉండాలని సూచించింది. సదరు వాహనంపై ఎలాంటి పెండింగ్ బకాయిలు ఉండకూడదు. మాగాణి మూడు ఎకరాల లోపు, మెట్ట అయితే పది ఎకరాల లోపు ఉండాలనే నిబంధన పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగం, పెన్షనర్‌గా ఉండకూడదు, ఐటీ రిటర్న్ ఫైల్ చేయకూడదనే నిబంధన విధించింది. వీటికి లోబడి జిల్లాలో అధికారులు ఆటోడ్రైవర్ల జాబితాలను పరిశీలించి 14,953మందిని మాత్రమే అర్హులుగా తేల్చారు.

అధికారుల పరిశీలనలో..

జిల్లాలో అధికారుల పరిశీలన(పెండింగ్)లో కొన్ని దరఖాస్తులు ఉన్నాయి. దీనిలో డబ్ల్యూడబ్ల్యూడీఎస్‌ల వద్ద 960 దరఖాస్తులు, ఎంపీడీవోల వద్ద 2709 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న ఈ దరఖాస్తులు కూడా వడబోత కార్యక్రమం పూర్తయితే అర్హుల జాబితా మరికొంత పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంటున్నారు.

మండలాలవారీగా అర్హులు వీరే

జిల్లావ్యాప్తంగా 14,953మంది అర్హులు కాగా దీనిలో అత్యధికంగా కాకినాడ అర్బన్ మండలంలో 2421మంది ఉన్నారు. ప్రత్తిపాడులో 481, గొల్లప్రోలు రూరల్‌లో 408, కిర్లంపూడి 509, పెదపూడి 401, రౌతులపూడి 281, ఏలేశ్వరం రూరల్‌లో 287, కాజులూరు 375, తుని అర్బన్ 178, తొండంగి 734, కరప 567, పెద్దాపురం రూరల్ 469, పిఠాపురం అర్బన్ 421, కాకినాడ రూరల్ 1786, పెద్దాపురం అర్బన్ 258, పిఠాపురం రూరల్ 723, గండేపల్లి 384, యు.కొత్తపల్లి 656, సామర్లకోట అర్బన్ 445, తునిరూరల్ 525, కోటనందూరు 280, ఏలేశ్వరం అర్బన్ 146, గొల్లప్రోలుఅర్బన్ 102, శంఖవరం 511, జగ్గంపేట 480, సామర్లకోట రూరల్ 707, తాళ్లరేవు 418అర్హులు గుర్తించారు.

1న సొమ్ములు జమ: జేసీ

వాహన మిత్ర పథకంలో అర్హులైన ఆటో డ్రైవర్లు అందరికీ అక్టోబరు 1న ఒక్కొక్కరి బ్యాంకుఖాతాలకు రూ.15వేల చొప్పున జమ చేస్తాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆటోడ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తోంది. ఈనెల 21 వరకు దరఖాస్తులను జిల్లాలో ఉన్న సచివాలయాల ద్వారా స్వీకరించి అర్హులను గుర్తిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అర్హులైన అందరి బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమ అవుతాయి. వాహనదారులు వేరేవారికి అమ్మిన వాహనం బదిలీ చేసుకోని వారికీ, కొత్తగా వాహనం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోనివారికి రెండో విడతలో ఆర్థికసాయం అందించడానికి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జేసీ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఆయా శాఖల్లో అర్జీలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించాలన్నారు. జిల్లాస్థాయిలో అధికారి ఆడిట్ చేసి నివేదికను పంపించి వాటిని తర్వాత రాష్ట్రస్థాయిలో ఆడిట్ చేస్తారన్నారు. బియ్యం కార్డుల మంజూరు, కార్డుల్లో పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, రీసర్వే, ఆక్రమణల తొలగింపు, డ్రైన్లు, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, తల్లికి వందనం వంటి అంశాలపై 415 అర్జీలు వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసు, సీపీవో త్రినాథ్, డీపీవో రవికుమార్, కేఆర్సీసీ ఎస్డీసీ రత్నమణి పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 51 అర్జీలు



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ స్థానికంగా పరిష్కారం కాక జిల్లా వ్యాప్తంగా 51మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ బిందుమాధవ్ నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి అర్జీదారుల ఫిర్యాదులు సమ్మతమైనవైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తిచేసి సాధ్యమైనంత త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్‌స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాల్లోను, సబ్‌డివిజన్ కార్యాలయాల్లోను ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులను పోలీస్ గ్రీవెన్స్‌గానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ బిందుమాధవ్ వెల్లడించారు.

వచ్చే నెల 31వరకు అంగీకార-25

- వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన జేసీ రాహుల్ మీనా



అంగీకార-25 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ రాహుల్ మీనా, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ

కాకినాడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్‌యోజన-అర్బన్ పీఎంఏవై లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు అంగీకార-2025 కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ అధికారులతో కలిసి జేసీ అంగీకార-2025 వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగీకార- కార్యక్రమం జిల్లాలో ఈనెల నాలుగో తేదీ నుంచి అక్టోబరు 31 వరకు నిర్వహిస్తారన్నారు. దీని ద్వారా పీఎంఏవై అర్బన్ గృహనిర్మాణ లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ప్రయోజనాలు, సూర్యఘర్, నిర్మాణ పనులు పూర్తయిన ఇళ్లకు గృహప్రవేశాలు చేసి ప్రారంభించడం వంటి ఇతర సదుపాయాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తామని జేసీ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, ఇతర హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

మా డిమాండ్లు పరిశీలించండి

- జేసీకి ఏపీపీహెచ్‌సీడీఏ వైద్యుల వినతి



జేసీ రాహుల్‌మీనాకు వినతిని అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ప్రతినిధులు

కాకినాడ,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యుల సంఘం ఏపీపీహెచ్‌సీడీఏ జిల్లాలోని వైద్యులు కోరారు. ఈ మేరకు జేసీ రాహుల్‌మీనాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోకపోవడంతో సమ్మె నోటీసు అందజేశామన్నారు. ఇప్పటికే విజయవాడలోని ప్రజారోగ్యకుటుంబ సంక్షేమశాఖ కార్యాలయానికి సమ్మె నోటీసు అందజేశామని వివరించారు.ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైమ్ బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని, 50శాతం ప్రాథమిక వేతనాన్ని గిరిజన భత్యంగా మంజూరు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, నెలవారీ చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమంకోసం రూ.5వేలు ఇవ్వాలని, స్థానికత, పట్టణ అర్హత సమస్యలు పరిష్కరించాలని వంటి డిమాండ్లను వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఏపీపీహెచ్‌సీడీఏలోని డాక్టర్ అరుణ, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ విల్సన్, డాక్టర్ అర్చన, డాక్టర్ బాబుశివ, డాక్టర్ మౌనిక, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సాయిరోహిత, డాక్టర్ ఈశ్వర్ కుమార్, డాక్టర్ కమల్‌నాథ్ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టరేట్‌ను ముట్టడించిన ఉద్యోగులు
- జేసీకి వినతిపత్రం అందజేత



కాకినాడ కలెక్టరేట్‌ను ముట్టడించిన విద్యుత్‌శాఖ ఉద్యోగులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి కాకినాడ సర్కిల్ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్‌ను ముట్టడించారు. సమితి చైర్మన్ బాలకుమార్ మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు విద్యుత్ సంస్థల యాజమాన్యాన్ని కోరినా ప్రయోజనం లేదన్నారు. విద్యుత్‌శాఖ కార్మికులతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ పైడిరాజు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



రత్నగిరిపై బాల అలంకరణలో వనదుర్గ అమ్మవారు

అన్నవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిపావంచా వద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలో ఉదయం 8 గంటలకు గణపతిపూజతో పండితులు క్రతువుకు శ్రీకారం చుట్టారు. రుత్వికులకు దేవస్థానం ఈవో సుబ్బారావు దీక్షా వస్త్రాలను అందజేశారు. అనంతరం జపాలు, పారాయణలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు వనదుర్గ, కనకదుర్గ ఆలయాల్లో లక్ష కుంకుమార్చన జరిపారు. తొలిరోజు అమ్మవారు బాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



బాలాత్రిపురసుందరిగా తలుపులమ్మ

తుని రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి వేకువజామునే ఆలయ పండితులు పూజలు జరిపారు. బాలాత్రిపుర సుందరీదేవిగా అనుగ్రహించిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



బ్రాహ్మిగా దర్శనమిచ్చిన మహాలక్ష్మి అమ్మవారు

పిఠాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శృంగేరి శంకర మఠం నిర్వహణలో కాకినాడ జిల్లా పిఠాపురంలో కొలువైయున్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకుడు ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ దంపతులు కలశస్థాపన, ఇతర పూజలు జరిపించారు. మహాలక్ష్మి అమ్మవారు తొలిరోజు బ్రాహ్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

జగజ్జననికి నీరాజనం



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

అంగరంగ వైభవంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

పాదగయలో రాజరాజేశ్వరిగా అమ్మవారి దర్శనం

పిఠాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో వేంచేసియున్న రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల శరన్నవరాత్ర శత చండీ యాగ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరుడు, కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాల సమయంలో అమ్మవార్లను అలంకరించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టుచీరలు, పండ్లు, పుష్పమాలలను అర్చకులకు జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన నాయకులు అందజేశారు.

రాజరాజేశ్వరీదేవి తొలిరోజు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాగణపతికి విఘ్నేశ్వర పూజ, కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవికి ప్రాతఃకాల విశేష సహస్రనామార్చన, కుంకుమార్చన జరిగాయి. పురుహూతికా అమ్మవారి శతచండీ యాగ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీచక్ర నవావరణార్చన సహిత సహస్ర పుష్పార్చన, శ్రీచక్ర లక్ష కుంకుమార్చన జరిగాయి. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో పురుహూతికా అమ్మవారు



శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టువస్త్రాలు సమర్పిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు



కాకినాడ శ్రీపీఠంలో లలితా సహస్రనామ కుంకుమార్చన చేస్తున్న మహిళలు

మహాశక్తి యాగం ఆరంభం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్రీపీఠం ప్రాంగణం ఎరుపు, కాషాయ రంగు చీరలు ధరించిన మాతృమూర్తులతో నిండిపోయింది. లలితా సహస్ర నామం, అమ్మ నామస్మరణతో ఆ పరిసరాలు మార్మోగాయి. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా రమణయ్యపేటలోని శ్రీపీఠం వెనుక సుమారు 5 ఎకరాల స్థలంలో శ్రీపీఠం వ్యవస్థాపకులు స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో 11 రోజుల పాటు జరిగే 3వ మహాశక్తి యాగం-2025 వేలాది మంది భక్తుల నడుమ సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఐశ్వర్యాంబిక అమ్మవారికి హారతి ఇచ్చి వెయ్యి కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చనలో భాగంగా వంద కోట్లు కుంకుమార్చన మహా క్రతువుకు శ్రీకారం చుట్టారు. అనంతరం స్వామి మాట్లాడుతూ త్రికరణ శుద్ధితో తలపెట్టిన సంకల్పానికి మించిన బలం మరేదీ లేదన్నారు. అమ్మ అంటే అందరికీ ఇష్టమేనని, ఈ సృష్టిలో మాట్లాడలేని మూగజీవి కూడా అమ్మ అంటుందన్నారు. ఏ డాదిలో మూడు నవరాత్రులు వస్తాయన్నారు. సరస్వతి శక్తి అంటే జ్ఞానం ఇచ్చే శక్తి. వారాహి నవరాత్రుల్లో, గుప్త నవరాత్రుల్లో వర్షాలు పడతాయన్నారు. వర్షం అంటే లక్ష్మీదేవి అని, ఆదిలక్ష్మి సంపదకు సంకేతంగా ఉంటుందన్నారు. ఉదయం రుత్వికుల ఆధ్వర్యంలో సహస్ర చండీ, వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, వటుక భైరవ హోమం, సహస్ర రుద్ర మహా రుద్ర హోమం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 15వేల మంది భక్తులు హాజరయ్యారని అంచనా వేశారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఏఆర్ ఏఎస్పీ ఎస్.శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మహా శక్తి యాగ క్రతువుకు శ్రీకారం చుడుతున్న స్వామి పరిపూర్ణానంద



దేవీచౌక్‌లో అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

దేవీ'చౌక్' వైభవం...

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు స్వర్ణకవచ కనకదుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. దేవీచౌక్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి.



దేవీచౌక్‌లో విద్యుత్ ధగధగలు



సామర్లకోట, ద్రాక్షారామల్లో విశేష అలంకరణల్లో బాలాత్రిపురసుందరి, మాణిక్యాంబ అమ్మవార్లు

సామర్లకోట, ద్రాక్షారామల్లో బాలాత్రిపురసుందరిగా...

సామర్లకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో వేంచేసియున్న బాలాత్రిపురసుందరి అమ్మవారికి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, కలశస్థాప నలను ప్రధానార్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), సన్నిధిరాజు వెంకటరమణ, అళొక్కి రాజగోపాలశర్మ వేదమంత్రో చ్ఛారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. దుర్గాసప్తశతి పారాయణ, బాలాపరమేశ్వరీ మంత్రజపం, స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, అమ్మవారికి నవవరణార్చన జరిపారు. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు), తాతపూడి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచీ తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. శ్రీచక్ర పండితుడు వేమూరి సోమేశ్వర శర్మ ఆధ్వర్యంలో విశేష హోమాలు చేశారు.

ద్రాక్షారామ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్వాదశ శక్తి పీఠమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని, అర్చకులు సంకల్పం చేసి ప్రారంభించారు. అనంతరం వైదిక క్రతువులు, వేద పారాయణ, సూర్యనమస్కారాలు, మహా లింగార్చన, అమ్మవారి అనుష్ఠానాలు, శ్రీచక్ర నవావరణార్చన జరిపారు. సాయంత్రం సువర్ణ, రజత, విశేష పుష్పార్చన, చతుర్వేద స్వస్తి, నీరాజన మంత్రపుష్పాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. రాత్రి కవాట బంధనం చేశారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పందిరిలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

నాందీ ఫౌండేషన్‌తో నన్నయ ఎంవోయూ

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



ఎంవోయూ పత్రాలను పరస్పరం అందిపుచ్చుకుంటున్న దృశ్యం

దివాన్‌చెరువు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రయోజనం చేకూరేవిధంగా నాంది ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. నన్నయ వర్సిటీలో వీసీ ప్రసన్నశ్రీ సమక్షంలో సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, నాందీ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ శ్రీలక్ష్మి ఎంవోయూలపై సంతకాలు చేసి పరస్పరం పత్రాలు అందిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా నన్నయ వర్సిటీతో నాంది ఫౌండేషన్ చేసుకున్న ఒప్పందం ద్వారా నన్నయ విశ్వవిద్యాలయం మెయిన్ క్యాంపస్, తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లతో బాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. వర్సిటీ, అనుబంధ కళాశాలల్లోని 22 వేల మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలకు అవసరమైన శిక్షణను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కళాశాలల్లోని విద్యార్థులకు ఉచిత ఉపాధి డొమైన్ నైపుణ్య శిక్షణా కార్యక్రమం నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఎంవోయూను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో విశ్వవిద్యాలయం శిక్షణా ఉపాధి కల్పన విభాగం అధికారి ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, వర్సిటీ అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో బుధవారం ఉదయం 9 గంటలకు 19 బాలురు, బాలికలకు జిల్లా స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్, ఖోఖో, హ్యాండ్ బాల్, రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక జరుగుతాయని స్కూల్ గేమ్స్ సెక్రటరీలు శ్రీనివాసరావు, సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కె.శ్రీనివాసరావు 90593 17248, 96035 04337 నెంబర్లలో సంప్రదించాలని ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రవిరాజు కోరారు.

వయోలిన్ 'గంగా' ప్రవాహం



వయోలిన్‌పై కీర్తనలు వాయిస్తున్న గంగా శశిధరన్

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సరస్వతి గాన సభ 122వ దసరా గానసభలు నగరంలోని సూర్యకళా మందిరంలో సోమవారం ప్రారంభ మయ్యాయి. బాల మాంత్రికురాలిగా కీర్తి గడించిన గంగా శశిధరన్ వయోలిన్ సోలో కచేరీ గంగా ప్రవాహంలా అత్యద్భుతంగా జరిగింది. అయిగిరి నందినితో ప్రారంభించి...హంసధ్వని రాగంలో దీక్షితుల వారి వాతాపిగణపతింభజే, శ్రీరాగంలో త్యాగరాజస్వామి వారి ఎందరో మహానుభావులు, రంజని, శ్రీరంజని, మనోరంజని రాగాల్లో వాగ్గేయకారుల దేవీ కృతులను ఆమె వాయించారు.గంగకు తృప్పుణిత్తుర శ్రీకాంత్ మృదంగంపై, తృప్పుణిత్తుర కుమార్ డోలుపై, మంజూర్ ఉన్నికృష్ణన్ ఘటంపై చక్కటి సహకారం అందించారు. సరస్వతి గానసభ సభ్యులు, అధిక సంఖ్యలో సంగీతప్రియులు కార్యక్రమాన్ని ఆద్యంతం వీక్షించి ఆనందించారు.

పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో నీటిని తొలగిస్తున్న దృశ్యం

పిఠాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ పుష్కరిణిలో నీటి తొలగింపును సోమవారం ప్రారంభించారు. మహాలయ పక్షాల సమయంలో 15 రోజులు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి పిండప్రదానాలు చేయడంతో పాటు వాటిని పుష్కరిణిలో కలిపారు. దీనితో పుష్కరిణిలో నీరు కలుషితమై వాసన వస్తుండడంతో నీరు తొలగించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా పుష్కరిణిలో నీటిని తొలగిస్తున్నారు. నీటిని పూర్తిగా తొలగించి పుష్కరిణిని శుభ్రపరచి కొత్త నీరు పెడతామని పాదగయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. అప్పటివరకు పాదగయకు వచ్చే సాధారణ భక్తులతో పాటు భవానీ మాల ధారులు జల్లు స్నానాలు ఆచరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు.

సంస్థను మోసం చేసిన ఉద్యోగి అరెస్టు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నం పెట్టే సంస్థకే కన్నం వేసిన కేటుగాడిని ప్రకాశంనగర్ పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. సీఐ బాజీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరా ఫైనాన్స్ కంపెనీలో 2018లో గోకవరానికి చెందిన బల్లేని వీరబాబు చిరుద్యోగిగా విధుల్లో చేరాడు. అనంతరం మేనేజర్ స్థాయికి ఎదిగాడు. సంస్థ లావాదేవీల్లో పూర్తిగా పట్టు ఉండడంతో కస్టమర్ల ఆధార్‌కార్డులను అక్రమంగా వినియోగించి,ఫోర్జరీ సంతకాలతో వాహనాలకు ఫైనాన్స్ చేయడం మొదలు పెట్టాడు. తద్వారా వచ్చిన డబ్బులను సంస్థ ఖాతాలో జమ చేయకుండా జల్సాలకు వాడుకొన్నాడు. ఇలా సుమారు రూ.30 లక్షల అక్రమానికి పాల్పడ్డాడని సీఐ పేర్కొన్నారు.సంస్థ ఫిర్యాదుతో అతడిని అరెస్టు చేశామన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి: డీపీఎం

కడియం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయ విధానం వైపు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం తాతారావు తెలిపారు.మురమండ రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రసాయనిక ఎరువులు,పురుగుమందులు లేకుండా జీవామృతం, ఘనామృతం వంటి వాటితో సాగు చేయడం ద్వారా అటు రైతులకు తక్కువ పెట్టుబడితోపాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఈస్టిండియా పాలనలోనే దసరా వేళ.. కనకదుర్గమ్మపై ప్రేమతో నాణెం ముద్రణ

మండపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మనదేశాన్ని ఈస్ట్ ఇండియా కంపెనీ పాలిస్తున్న సమయంలో దసరా పండుగల సందర్భంగా కనకదుర్గమ్మ చిత్రాన్ని 1808లో ఆఫ్ అణా పేరిట రాగినాణేన్ని ముద్రించి హిందువుల పండుగల పట్ల వున్న అభిమానాన్ని చాటుకున్నారు. 1616 సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీ లక్ష్మీదేవి అమ్మవారి చిత్రాన్ని ఆఫ్ అణా రాగినాణంపై ముద్రించారు. సుమారు 404 సంవత్సరాల క్రితం లక్ష్మీదేవిని రాగి నాణంపై ముద్రించిన చరిత్ర ఈస్ట్ ఇండియా కంపెనీకి దక్కుతుంది. 1818లో ముద్రించిన కనకదుర్గమ్మ నాణెం 207 సంవత్సరాల తర్వాత కూడా చెక్కుచెదరకుండా ఉంది. అయితే దేవతామూర్తుల నాణాలు చెల్లుబాటు అయ్యేలా ముద్రించడం విశేషం. కాగా ఈ నాణాలు కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన తోరాటి నాగభూషణం వద్ద నేటికీ భద్రంగా ఉన్నాయి.







మంచు మైమరపించు...

మెట్టలో మంచు అందాలు మైమరపిస్తున్నాయి. తూర్పు కనుములు పచ్చదనాన్ని పరుచుకుని ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కాకినాడ జిల్లా తుని జాతీయ రహదారిపై సోమవారం మంచు తెరలు ఇలా కమ్ముకుని కొండలకు కొత్త వన్నె తెచ్చాయి. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించిందిలా...
- తుని రూరల్ (ఆంధ్రజ్యోతి)

ఇజ్రాయెల్‌లో ఉద్యోగాల పేరుతో మోసం

- ఒక్కొక్కరి నుంచి రూ.8 లక్షల వసూలు
- తప్పించుకునేందుకు చెల్లని చెక్కులు ఇచ్చిన వైనం
- బాధితుల్లో కొందరు కోనసీమ వాసులు
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు బాధితుల నిరసన


చెల్లని చెక్కులను చూపిస్తున్న బాధితులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగాల పేరుతో మోసం చేయడంతో బాధితులు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళన చేశారు. బాధితుల కథనం మేరకు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో 2023 నవంబరు 12న సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా ధరూరుకు చెందిన మరనాత మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ కె.సుదర్శన్ అబ్రహంను స్థానికుడొకరు వారికి పరిచయం చేశారు. ఇజ్రాయెల్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించిన అబ్రహం రూ.8 లక్షల చొప్పున 42 మంది వద్ద డబ్బు వసూలు చేశాడు. 2024 జూలై 9న వారిని ఇజ్రాయెల్‌కు పంపించాడు. అక్కడ ఉద్యోగాలు ఇప్పించక పోవడంతో వారంతా జూలై 16న స్వదేశానికి తిరిగి వచ్చారు. మరుసటి రోజు వారందరూ ధరూరుకు వచ్చి అబ్రహంను కలిసి తమ డబ్బు తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో వారందరికీ వేర్వేరు తేదీలతో చెక్కులు ఇవ్వడంతో స్వస్థలాలకు వెళ్లిపోయారు. అయితే చెక్కులేవీ చెల్లకపోవడంతో అప్పటి నుంచి పలుమార్లు బాధితులు పాస్టర్‌ను ఫోన్లలో సంప్రదిస్తూనే ఉన్నారు. కొందరు స్వయంగా వచ్చి డబ్బుల డిగారు. కొన్నాళ్లకు ఫోన్ ఎత్తకపోవడంతో ఈ నెల 13న 15 మంది బాధితులు ధరూరులోని మరనాత చర్చికి వచ్చారు. పాస్టర్ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో డబ్బులు ఇచ్చే వరకు ఇక్కడే ఉంటామని చెప్పి, చర్చి పక్కనున్న ఓ హాల్‌లో ఉంటున్నారు. కాగా.. రెండ్రోజుల క్రితం పాస్టర్ కుటుంబ సభ్యులు 100కు ఫోన్ చేసి తమ ఇంటిపై కొందరు దౌర్జన్యానికి యత్నిస్తున్నారని చెప్పారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ 'ప్రజావాణి' కార్యక్రమంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఒంటరి మహిళల మెడలోని గొలుసులే టార్గెట్

11 చోట్ల చోరీలు

కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరి దొంగల అరెస్ట్

అత్తిలి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అత్తిలి తదితర ప్రాంతాల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు తణుకు రూరల్ సీఐ బి.కృష్ణమోహన్, అత్తిలి ఎస్ఐ పి.ప్రేమ రాజు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి పోలీస్ స్టేషన్లో సీఐ మాట్లాడుతూ కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పవర గ్రామానికి చెందిన అనుబోయిన నాని బాబు, పనసపాడు గ్రామానికి చెందిన బొమ్మరాజులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఒంటరిగా ఉన్న మహిళల మెడలోని గొలుసులు చోరీ చేసి ఎత్తుకెళ్లడం వీరి నైజమని అన్నారు. తుని, అన్నవరం, రాజోలు, రావులపాలెం, అత్తిలి, ఇరగవరం, తణుకు తదితర ప్రాంతాలలో 11 చోట్ల దొంగతనాలు చేసినట్లు తెలిపారు. అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి వద్ద మహిళ మెడలో గొలుసు దొంగిలించి పారిపోతుండగా మంచిలి గ్రామం వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 223 గ్రాముల బంగారం, మారుతి కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను తణుకు కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. ఈ కేసులో కానిస్టేబుల్ ఎస్.కె.అన్వర్, మలక శ్రీనివాస్, వై.శివకృష్ణ సహకరించినట్లు వారు తెలిపారు.

గంధం చెట్లు నరికిన ముగ్గురు మధ్యప్రదేశ్ వాసుల అరెస్ట్

రూ.10,25,000 విలువైన చెట్టు మానులు స్వాధీనం


రాజానగరం పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

రాజానగరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నందరాడలోని ఒక తోటలో గంధం చెట్లు నరికిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ నిందితుల వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన తన్నీరు విజయ కుమార్‌కు రాజానగరం మండలం నందరాడ గ్రామంలో 12 ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలో కొబ్బరి, మామిడి, టేకు, ఎర్ర చందనం, శ్రీగంధం చెట్లను పెంచుతున్నారు. సదరు తోటలో దొడ్డా సోమేశ్వరరావు సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 16న సోమేశ్వరరావు పొలం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లిపోయాడు. 19న ఉదయం తోటమాలి పిన్నమరాజు సత్యనారాయణ తోటలోకి వెళ్లి చూడగా తోటలో ఉన్న 2 గంధపు చెట్లను ఎవరో నరికి తీసుకెళ్లడం గమనించి సోమేశ్వరరావుకు ఫోన్‌లో సమాచారం అందించాడు. దీంతో సోమేశ్వరరావు తోటలోకి వెళ్లి చూడగా గంధం చెట్టు నరికేసి అపహరించినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గంధం చెట్లను మొదలకు కోసి చెట్టు చివరి భాగం వదిలిపెట్టి మొదలు భాగాన్ని ముక్కలుగా నరికి దొంగిలించారు. ఈ మేరకు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ పర్యవేక్షణలో ఎస్.ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మధ్యప్రదేశ్ నుంచి వచ్చి సంచార జీవనం చేస్తున్న వ్యక్తులను అనుమానితులుగా గుర్తించి ఈ నెల 21న దివాన్ చెరువు సమీపంలో పట్టుకుని విచారించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కట్ని జిల్లాకు చెందిన జాలిస్ ఆదివాస్, శివరాజ్ ఆదివాసీ, ఉల్లిష్ అలియాస్ టీటూ అనే ముగ్గురుని పట్టుకుని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి గంధం చెట్ల మాను ముక్కలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.10,25,000 ఉంటుందన్నారు.

ఆ లేఖతో మాకు సంబంధం లేదు

మావోయిస్టు పార్టీ డివిజన్ కార్యదర్శి లచ్చన్న ప్రకటన


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ
పత్రికా ప్రకటన
తేదీ : 22-సెప్టెంబర్-2025

మావోయిస్టుల పేరిట విడుదలైన లేఖ

చింతూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఇటీవల మావోయిస్టుల పార్టీ పేరిట విడుదలైన లేఖతో తమకు ఎటు వంటి సంబంధం లేదని మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి లచ్చన్న సోమవారం ఖండించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ పేరిట విప్లవ సంతకంతో ఓ లేఖ విడుదలైందన్నారు. ఆ లేఖలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, దుమ్ముగూడెంకు చెందిన పలువురి రాజకీయ నాయకులు, ఓ పత్రికా విలేకరిని కూడా హెచ్చరించడం జరిగిందని లచ్చన్న పేర్కొన్నారు. ఇదంతా కొంతమంది పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారమని, ఏజెన్సీలో గందరగోళం సృష్టించేందుకే ఈ తరహా ప్రకటనలు విడుదల చేస్తున్నారని మండిపడ్డారు.

ఇసుక దొంగతనం చేసిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నమ్మించి ఇసుక దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన గూడపాటి రాజశేఖర్ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవంలో ప్రభుత్వం మంజూరుచేసిన దుర్గా వెంకటరమణ సాండ్ ట్రేడర్స్ ద్వారా ఓపెన్ ఇసుకర్యాంపు నుంచి ఇసుక తీసుకువచ్చి స్టాక్ పాయింటులో నిల్వ చేసి అక్కడ నుంచి విశాఖ, అనకాపల్లి జిల్లాలలోని ప్రభుత్వ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇసుక సరఫరా చేస్తున్నాడు. స్టాక్ పాయింటు వద్ద భీమవరానికి చెందిన కునిపూడి శ్రీనివాస్ అలియాస్ చిరుత శ్రీనుని ఏపీ ప్రభుత్వ హౌసింగ్ కార్పొరేషన్ ర్యాంపులో గుమస్తాగా నియమించింది. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ తన అల్లుడైన పంపన గణపతికి సొంత లారీలు ఉన్నాయని చెప్పి రాజశేఖర్‌కు పరిచయం చేసి ఇసుక రవాణాకు నియమించాడు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు స్టాక్ పాయింటు మూసివేసిన తరువాత ఇద్దరు కలిసి సుమారు 196 ట్రిప్పులు రూ.6,47,881.92లు విలువైన ఇసుకను మోసగించి స్టాక్ పాయింటు నుంచి దొంగతనంగా తరలించారు. అంతేకాకుండా ఇసుక రవాణా నిమిత్తం రాజశేఖర్ వద్ద రూ.8లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నాడు. పంపన గణపతి కుటుంబ అవసరాల నిమిత్తం లారీని దస్తావేజు అగ్రిమెంటు చేసుకుని మరో రూ.15 లక్షలు తీసుకున్నాడు. లారీని ఫిర్యాదుపేరుపై రిజిస్ట్రేషన్ చేయకుండా రాత్రి సమయంలో లారీని ర్యాంపు నుంచి నవాబుపాలెం తీసుకువెళ్లిపోయాడు. మొత్తం రూ.30 లక్షల వరకు మోసగించినట్టు ఇద్దరిపై రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ శ్రీహరిరావు పేర్కొన్నారు.

బోనాల సంబరం


రౌతులపూడిలో బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

రౌతులపూడి/ తునిరూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడిలో దుర్గాదేవి అమ్మవారు బాలత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అధిక సంఖ్యలో మహిళలు బోనాలు సమర్పించారు. అలాగే తుని మండలం ఎన్.సూరవరం గ్రామంలో కూడా బోనాల సంబరం జరిగింది. టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి నాగ సోమరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా మహిళలు బోనాలను శిరస్సును ధరించి గ్రామ పురవీధుల్లో ప్రదర్శన చేశారు.



తునిరూరల్: ఎన్.సూరవరం గ్రామంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

గ్యాస్ పైపులైన్ లీకేజీ

గుర్తించిన రైతులు... అప్రమత్తమైన అధికారులు

అంబాజీపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి- కొత్తపాలెం వద్ద ఉన్న అప్పర్ కౌశిక గట్టుపై సోమవారం ఓఎన్జీసీకి చెందిన గ్యాస్ పైపులైన్ స్వల్పంగా లీకైంది. వ్యవసాయ పనుల నిమిత్తం అటుగా వెళ్లే రైతులు కొంత మంది గ్యాస్ లీకేజీని గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన అధికారులు లీకేజీ విషయాన్ని ఓఎన్జీసీ అధికారులకు సమాచారం అందించగా అయినవిల్లి మండలం మడుపల్లి నుంచి మామిడికుదురు మండలం పాశర్లపూడి వెళ్తున్న పైపులైన్ లీకేజీని గుర్తించి అరికట్టారు. స్థానికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.


కె.పెదపూడిలో గ్యాస్ లీకేజీ దృశ్యం

లారీని ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

మరొకరికి గాయాలు

దివాన్‌చెరువు వద్ద ఘటన

దివాన్‌చెరువు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద జరిగిన ప్రమాదంలో రాజమహేంద్రవరం మోడల్ కాలనీకి చెందిన బత్తుల తారకరాజు (27) మృతిచెందాడు. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి తారకరాజు స్నేహితులతో కలసి రాజానగరం వైపు నుంచి లాలాచెరువు వైపునకు మూడు బైక్‌లపై వెళ్తున్నారు. స్థానిక జీరోపాయింట్ వద్ద తారకరాజు ప్రయాణిస్తున్న వాహనాన్ని అతడి స్నేహితుడు పల్లా గోపినాథ్ నిర్లక్ష్యంగా నడిపి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన తారకరాజు అక్కడికక్కడే మృతిచెందగా గోపీనాథ్‌కు గాయాలయ్యాయని బొమ్మూరు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి మృతుడి బంధువులు సోమవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


లభ్యమైన మృతదేహం

నిడదవోలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ మొదటి వీధిలో సోమవారం దాదాపు 45 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. బహుశా అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. దీనిపై అనుమానాస్పద మృతికేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

రాయవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నిందితుడిగా ఉండి పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం.. గంజాయి కేసులో ఏ6 నిందితుడిగా ఉన్న మందపల్లి డానియేల్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పరారీలో ఉన్నాడు. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో రాయవరం పోలీసులు డానియేల్‌ను సోమవారం కోనసీమ జిల్లా మండపేట బైపాస్ రోడ్డు సమీపంలో బోర్డు స్కూల్ రోడ్డులో అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కోరారు.

'మత్స్యకార సమస్యలపై సమష్టి పోరాటం'

కొత్తపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ, అమీనబాద్ తీర ప్రాంతాలకు చెందిన మత్స్యకార నాయకులు తమ సమస్యలపై సమష్టి పోరాటం చేసేందుకు సోమవారం సమావేశమయ్యారు. తీరప్రాంతాల్లో నెలకొల్పిన రసాయన పరిశ్రమల కారణంగా సముద్రంలో మత్స్య సంపద లభ్యం కాకపోవడంతో తమకు జీవనోపాధి పోయిందని ఆవేదన చెందారు. సుమారు 500మంది మత్స్యకారులు ఉప్పాడ నుంచి కాలినడకన కొత్తపల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చి ఉప్పాడ- అమీనబాద్ బీచ్ రోడ్డులో మంగళవారం తలపెట్టిన ఆందోళనకు అనుమతి ఇవ్వాలని ఎస్ఐ జి.వెంకటేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉమ్మిడి జాన్, నక్కా మణికంఠ, సూరాడ ఎల్లాజీ, చోడిపల్లి ప్రసాద్, సూరాడ రాజు, మేరుగు భూషణం, ఓసిపల్లి అప్పన్న, గంటా విజయకుమార్ పాల్గొన్నారు.

తిరుపతి-విశాఖ మధ్య 20 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-విశాఖ మధ్య సామర్లకోట మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు నవంబరు 25 వరకూ 20 వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపనున్నట్టు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా వెల్లడించారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది.

08584 నంబరు గల రైలు తిరుపతి-విశాఖపట్నం మధ్య నవంబరు 25 వరకూ ప్రతీ మంగళవారం తిరుపతిలో రాత్రి 9.50 గంటలకు బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు 10 ట్రిప్‌లుగా నడువనుంది. అలాగే 08583 నంబరు గల రైలు విశాఖపట్నం-తిరుపతి మధ్య నవంబరు 24 వరకూ ప్రతీ సోమవారం తిరుపతిలో రాత్రి 7.10 గంటలకు బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు 10 ట్రిప్‌లుగా నడువనుంది. 08583 నంబరు గల ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖపట్నంలో ప్రతీ సోమవారం రాత్రి 7.10 గంటలకు బయలుదేరుతుంది. దువ్వాడ, అనకాపల్లి, యలమంచలి, అన్నవరంనకు రాత్రి 9.35 గంటలకు చేరుతుంది, సామర్లకోటకు రాత్రి 10.02కి చేరుతుంది. రాజమహేంద్రవరానికి రాత్రి 10.52 గంటలకు చేరుతుంది. నిడదవోలు, తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, శ్రీకాళహస్తి, రేణిగుంటల మీదుగా తిరుపతికి మరుసటి రోజు మంగళవారం ఉదయం 10.12 గంటలకు చేరుతుంది. ఈ ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు సెప్టెంబరు 23, 30 అక్టోబరు 7, 14, 21, 28 నవంబరు 4, 11, 18, 25 తేదీలలో విశాఖపట్నం నుంచి 10 ట్రిప్‌లుగా బయలుదేరుతుంది.

08584 నంబరుగల తిరుపతి-విశాఖపట్నం మధ్య వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతిలో ప్రతీ మంగళవారం రాత్రి 9.50 గంటలకు బయలుదేరుతుంది. రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, నిడదవోలు మీదుగా రాజమహేంద్రవరానికి ఉదయం 6.43 గంటలకు, సామర్లకోటకు 7.28, అన్నవరానికి 7.53 గంటలకు చేరుతుంది. యలమంచలి, అనకాపల్లి, దువ్వాడల మీదుగా విశాఖపట్నం బుధవారం ఉదయం 10.15 గంటలకు చేరుతుంది. ఈ వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సెప్టెంబరు 22,29 అక్టోబరు 6,13,20,27 నవంబరు 3,10,17,24లలో 10 ట్రిప్‌లుగా బయలుదేరుతుంది.

సెంట్రల్ జైలు ఖైదీ పరారీ


ప్రభాకర్ (ఫైల్)

దేవరపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి వాయిదా నిమిత్తం విజయవాడ తీసుకెళ్లి తిరిగి రాజమహేంద్రవరం తీసుకొస్తున్న సమయంలో ఖైదీ బత్తుల ప్రభాకర్ పరారయ్యాడు. దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారి పక్కనున్న గోదావరి రెస్టారెంట్ వద్ద టిఫిన్ చేసేందుకు సోమవారం రాత్రి ఎస్కార్ట్ వ్యాను ఆగింది. ఇదే అదునుగా భావించిన ప్రభాకర్ మూత్ర విసర్జన కోసం తీసుకెళ్లమని అడిగి తప్పించుకుని పరారయ్యాడు. దీనిపై దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభాకర్ కోసం గాలిస్తున్నామని, పోలీసుల నుంచి తప్పించుకున్న సమయంలో చేతికి సంకెళ్లు, వైట్ కలర్ టీషర్టు, బ్లాక్ కలర్ ట్రాక్‌ను ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసినవారు 9440796584, 9440796624 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం అందజేస్తామన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

భూమి కబ్జాపై ఫిర్యాదు

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మండలం జి.రాగంపేటలో సర్వే నెం.344/7లో ఉన్న 60 సెంట్లతో పాటు ఇతర గట్లను (40 సెంట్లు)... మొత్తంగా ఎకరం భూమిని ఇతరులు కబ్జా చేశారని సామర్లకోట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి సోమవారం కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు ఫిర్యాదు చేశారు. అధికారులు దృష్టి పెట్టి సర్వే చేసి తమ భూమిని తమకు అప్పగించాలని కోరారు.



పిఠాపురంలో కలశలతో మాజీ ఎమ్మెల్యే వర్మ, మహిళలు



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శైలపుత్రి అలంకారంలో అపర్ణాదేవి



సామర్లకోట అయోధ్య రామపురంలో ప్రత్యేక అలంకరణలో సత్తెమ్మ అమ్మవారు



సామర్లకోట కంచి మహా సంస్థానంలో విశేష అలంకరణలో స్వయంవర పార్వతి అమ్మవారు



పెద్దాపురం భువనేశ్వరి పీఠంలో బాలాత్రిపుర సుందరి అలంకరణలో భువనేశ్వరి అమ్మవారు

దేవీ శరన్నవరాత్రులు ఆరంభం

పిఠాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి నామస్మరణతో పిఠాపురం మార్మోగింది. రైల్వే స్టేషన్, గుట్ల వీధి, పాతబస్టాండు, జగ్గయ్యచెరువు కాలనీ, డ్రైవర్స్ కాలనీ, మోహననగర్, మంగాయమ్మరావుపేట, అగ్రహారం ప్రాంతాల్లోని కనకదుర్గమ్మ ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమ పూజలు జరిగాయి. మోహననగర్‌లోని ఆలయం వద్ద ఉత్సవాల ప్రారంభంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహంతో పాటు 108 మంది మహిళలు, భవానీ భక్తులు కలశలతో గ్రామోత్సవం నిర్వహించారు. వర్మ కూడా కలశాన్ని ఎత్తుకుని మహిళలతో పాటు ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని సదరు జలాలతో అభిషేకించారు. ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండు, కరణంగారి తోట, ఈబీసీ కాలనీ, కొత్తపేట, దేవీనగర్ తదితర ప్రాంతాల్లో కనకదుర్గమ్మ ఆలయాల వద్ద ఉత్సవాలకు అంకుర్పారణ జరిగింది. అమ్మవార్లకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పల్లకీ సేవ, గ్రామోత్సవాలు నిర్వహించారు. బస్టాండు, కరణంగారితోట ఆలయాల్లో కనకదుర్గమ్మకు విశేష అలంకారం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): దుర్గాడ శివాలయంలో లలితాదేవి, ఉమాదేవి అమ్మవార్లకు అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు కుంకుమార్చన జరిపించారు. తాటిపర్తిలో అపర్ణాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు గ్రంధి రమేష్-అలేఖ్య దంపతులు కలశస్థాపన చేశారు. సహస్రనామార్చనలు జరిగాయి. అమ్మవారిని శైలపుత్రిగా ఏకబిల్వం, త్రిదళం, మహామారేడు దళాలతో అలంకరించారు. వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకర శాస్త్రి పూజలు జరిపించగా ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): హరిహర క్షేత్రంలో వ్యవస్థాపకుడు పరమానందగిరి ఆధ్వర్యంలో అన్నపూర్ణమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బడేలమ్మ చెరువు వద్ద వేంచేసియున్న నవదుర్గాలయంలో వ్యవస్థాపకురాలు కనక విజయలక్ష్మి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. అయోధ్యరామపురంలోని కనకదుర్గమ్మ ఆలయం, సత్తెమ్మ ఆలయం, నీలమ్మ చెరువు వద్ద గల సత్తెమ్మ ఆలయం, రాజీవ్ గృహకల్ప సముదాయాల వద్ద గల దుర్గమ్మ ఆలయంలో, సత్యనారాయణపురం సత్తెమ్మ ఆలయంలో వ్యవస్థాపకురాలు రెడ్డిపల్లి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో అర్చకులు సాయిరామ్ కుంకుమార్చన జరిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు సౌజన్యంతో చక్కెర పొంగలి, పులిహోర, క్షీరాన్నం, బూరెలను ప్రసాదంగా భక్తులకు అందజేశారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ అమ్మవారికి పూజలు చేసి హారతి ఇచ్చారు. అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), గుమ్మళ్ల రామకృష్ణ, బలుసు శ్రీనివాసు, గోలి సత్తిరాజు, అడ్డాల వెంకన్నబాబు, బొందల రామలక్ష్మి, గూనపాటి బుల్లెమ్మ, అత్తిలి కృష్ణ, పైండి సత్యసాయిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కంచి కామకోటి మహా సంస్థానంలో స్వయంవర పార్వతి అమ్మవారికి ఆలయ వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి-పద్మ దంపతులు విశేష పుష్పార్చన చేశారు. అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించగా జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు, పలువురు ప్రముఖులు హాజరై దర్శించుకున్నారు. సంప్రదాయం ప్రకారం వేట్లపాలెం గ్రామ పొలిమేరలో ఉన్న బేతాళస్వామి ఉత్సవ విగ్రహానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఒక భక్తుడు శిరస్సున ధరించి గ్రామోత్సవం నిర్వహించి బేతాళస్వామి ఆలయానికి మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య తరలించారు. ఆలయ కమిటీ ప్రతినిధులచే ప్రతిష్ట పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. సామర్లకోట సీఐ శ్రీకృష్ణభగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కొమరగిరిలో బాల కనకదుర్గ బాలాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొమరగిరి, పరిసర గ్రామాల ప్రజలు పసుపు, కుంకుమ, గాజులతో అమ్మవారికి పూజలు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కుతుకుడుమిల్లి మార్కెట్ వీధిలో జైభేళాళస్వామి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కొత్తపల్లి ఊర చెరువు గట్టుపై జమ్మి చెట్టు వద్ద జైబేతాళ స్వామి ఉత్సవ విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. అనంతరం జైబేతాళ స్వామి ఉత్సవ విగ్రహాన్ని కర్రసాముతో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. విజయదశమి నాడు భారీ సంబరం జరుపుతామని నిర్వాహకులు చెప్పారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరుుల వారి వీధిలో భువనేశ్వరీ పీఠంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపీశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకలమ్మ ఆలయాల్లో కార్యనిర్వహణాధికారులు కురం విజయలక్ష్మి, ఎం.రాంబాబురెడ్డి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు.



సినీ నటి రాశీఖన్నా నుంచి అవార్డు అందుకుంటున్న సూర్యశ్రీనివాస్

ఫొటోగ్రఫీలో కరప యువకుడికి జాతీయ పురస్కారం

కరప, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరపకు చెందిన చోడపునీటి సూర్యశ్రీనివాస్ ఐకానిక్ లగ్జరీ వెడ్డింగ్ ఫొటోగ్రఫీలో ప్రతిష్టాత్మక టైమ్స్ బిజినెస్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఇటీవల విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును సినీ నటి రాశీఖన్నా నుంచి అందుకున్నాడు. ఫొటోగ్రఫీలో ప్రదర్శించిన సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు, పెళ్లిళ్లలో చూపిన అత్యుత్తమ నైపుణ్యానికి ఆయన ఈ అవార్డు సొంతం చేసుకున్నాడు. కార్యక్రమంలో సినీ, వ్యాపార, సాంస్కృతి రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



పేద విద్యార్థికి రూ.25వేలు సాయం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన చీకట్ల శ్రీహరి రాజు 2019లో ప్రమాదంలో మరణించాడు. దీంతో పదో తరగతి సీబీఎస్ఈలో మంచి మార్కులు సాధించి ఇంటర్‌లో చేరిన అతని కుమారుడు మణికంఠ చదువుకు ఆటంకం కలిగింది. దీంతో తల్లి భవానీ శ్రీయువసేన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బొల్లం సతీష్‌ను ఆశ్రయించింది. ఆయన విన్నపం మేరకు కాకినాడకు చెందిన వ్యాపారవేత్త గుత్తుల జయచంద్ర సోమవారం రూ.25వేలు ప్రకటించారు. శ్రీయువసేన కార్యాలయంలో జయచంద్ర పుట్టినరోజు కేక్ కట్ చేసి మణికంఠకు నగదు అందజేశారు.



పాదగయకు పోటెత్తిన భవానీ భక్తులు

పిఠాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నవరాత్రుల తొలిరోజున భవానీ మాలలు ధరించేందుకు భారీగా వచ్చిన భక్తులతో పాదగయ పరిసరాలు కిటకిటలాడాయి. వారు పుష్కరిణి వద్ద జల్లు స్నానాలు ఆచరించి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల సన్నిధిలో అర్చకులు భవానీ మాలలు ధరింపజేసి పూజలు చేయించారు. సోమవారం ఒక్కరోజే మూడు వేల మందికి పైగా భక్తులు భవానీమాలలు ధరించారు. ఈవో, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలు సోమవారం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, యార్లగడ్డ రామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కుండల సాయికుమార్‌యాదవ్, జిల్లా మీడియా ప్రతినిధి తుమ్మలపల్లి నాని, గొరకపూడి చిన్నయ్యదొర, మొసలిగంటి సురేష్‌బాబు, జ్యోతుల రాజేష్, ప్రముఖ న్యాయవాది కొండేపూడి ఉదయకుమార్, జి.చిన్న, రెడ్డి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ లఘు చిత్ర పోటీల్లో 'తెలుగు వైభవం'కు తృతీయ స్థానం



నిర్మాత జానకిరామ చౌదరిని అభినందిస్తున్న పారిశ్రామికవేత్త శ్రీనివాసరావు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 3, 4 తేదీల్లో గుంటూరులో జరగబోయే 3వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు భాషా వికాసంపై అంతర్జాతీయ లఘు చిత్ర పోటీలు నిర్వహించారు. కాకినాడకు చెందిన ప్రముఖ యూట్యూబర్, జర్నలిస్ట్, సినీ నటుడు సూర్య ఆకొండి దర్శకత్వం వహించి నటించిన 'తెలుగు వైభవం' లఘు చిత్రం తృతీయ స్థానంలో నిలిచి రూ.50వేల నగదు బహుమతి గెలుచుకుంది. ఎడిటింగ్ విభాగంలో కూడా వ్యక్తిగత బహుమతి కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా సోమవారం నగరంలోని దంటు కళాక్షేత్రంలో దర్శక, నిర్మాతలు సూర్య ఆకొండి, మార్ని జానకిరామచౌదరి మీడియా సమావేశం నిర్వహించారు. వారితో పాటు చిత్రంలో నటించిన రంగస్థల, సినీ నటుడు కెర్ల పుల్లారావు, వర్ధమాన నటి కుమారి సౌందర్యలను యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు, కార్యదర్శి ఎన్.ప్రభుదాసు, పారిశ్రామికవేత్త గుబ్బల శ్రీనివాసరావు, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు, ప్రముఖ ఆక్యుప్రెజర్ స్పెషలిస్ట్ శ్రీలక్ష్మి, బెస్ట్ ల్యాబ్ ప్రతినిధి వెంకట్ తదితరులు అభినందించారు.

విద్యార్థినులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 'బాలికను రక్షించండి' అంశంపై ఈ నెల 20న వ్యాసరచన, చిత్రలేఖనం, వాద-ప్రతివాద పోటీలను సాలిపేట గర్ల్స్ హైస్కూల్లో నిర్వహించారు. 21 మండలాల నుంచి 84 మంది విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొనగా కాకినాడ డీవైఈవో కేవీవీ సత్యనారాయణ, అర్బన్ ఎంఈవో సీహెచ్ రవి, బాలికా రక్షణ అభివృద్ధి అధికారిణి ఉమామహేశ్వరి పర్యవేక్షించారు. వ్యాసరచనలో కేథరిన్ షర్మిల, శ్రావణిదుర్గ, శరణ్య, వాద-ప్రతివాద విభాగంలో అఖిల్ కుమార్, ఐశ్వర్యాంబిక, వర్ష, సాయిఅషిత, తేజ ఐశ్వర్య, రామతులసి, చిత్రలేఖనంలో సోనాలి, నిక్షిత, దేవి ధనూష విజేతలుగా నిలిచారు. వీరికి అంతర్జాతీయ బాలికా దినోత్సవం రోజున కలెక్టర్ షాన్‌మోహన్ నగదు ప్రోత్సాహకాలు అందజేస్తారని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులను డీఈవో పిల్లి రమేష్ అభినందించారు.

'రాష్ట్రంలో ఆర్పీఐ (అథవాలే) బలోపేతానికి కృషి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్పీఐ (అథవాలే) శాఖను బలోపేతం చేస్తామని జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.వెంకటస్వామి, దక్షిణ భారత ప్రధాన కార్యదర్శి పులి ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన దక్షిణ భారత సమావేశానికి పులి ప్రసాద్ అధ్యక్షత వహించగా వెంకటస్వామి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పార్టీలో చేరడం ద్వారా రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా నడిపల్లి వసంతను నియమించారు.

సమావేశంలో ఆంధ్ర మాలమహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, జై భీమ్‌రావ్ పార్టీ రాష్ట్ర పీఏసీ చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, ఆర్పీఐ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు అయిరేణి శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జేసీ వెంకట రమణప్ప, దళిత భారత ప్రధాన కార్యదర్శులు గొల్లపల్లి నాగరాజు, సచిన్‌గౌడ్, నాయకులు వెంకటరత్నం, విష్ణు, మహేంద్రవర్మ, నాగరాజు, విక్రమ్, చిరంజీవి, ఆనంద్, వసంత్, సుజాత, వెంకటలక్ష్మి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన సదస్సు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్వాస తీసుకోవడం, గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు గుండెపై చేతులతో ఒత్తుతూ రక్తప్రసరణ జరిగేలా చేసి ప్రాణాన్ని కాపాడేలా చేసే విధానమే కార్డియో పల్మోనరీ రిసెటేషన్ (సీపీఆర్) అని రెడ్‌క్రాస్ సొసైటీ శిక్షకుడు సీహెచ్ చిన సత్యనారాయణ పేర్కొన్నారు. బోట్ క్లబ్ పార్కులో లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ అధ్యక్షుడు ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాల హోరు



జేసీ రాహుల్ మీనాకు వినతిపత్రం ఇస్తున్న ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డెత్ బెనిఫిట్ ఫండ్ కింద కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం, స్టేట్ బార్ కౌన్సిల్ విఫలమయ్యాయని విమర్శించారు. అర్హులైన న్యాయవాదులకు రూ.10లక్షల ఆరోగ్య బీమా కార్డులు మంజూరు చేయాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు రూ.10వేలు చొప్పున స్టైఫండ్ మంజూరు చేయాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం ఇచ్చారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షులు కోలా శ్రీహరిరావు, వసంతకుమారి, చెక్కపల్లి వీరభద్రరావు, పిల్లి శ్రీనివాసుగౌడ్, మంగా శివరామకృష్ణ, జేవీ రమణ, సరోజిని, నరేంద్ర, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వీఆర్ఏల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సంఘం అధ్యక్షుడు సురేష్ ఇజ్రాయేలు మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలన్నారు. నామినీలను వీఆర్ఏలుగా నియమించే అవకాశం కల్పించాలన్నారు. అర్హులైన అందరికీ ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. పెండింగులో ఉన్న కారుణ్య నియామకాలను తక్షణం చేపట్టాలన్నారు. జిల్లాలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం ఇచ్చారు. సంఘ ప్రధాన కార్యదర్శి చినబాబూజీ, ఉపాధ్యక్షుడు వి.సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు లక్ష్మణ్, కృష్ణ, సుభాని, వీరబాబు, తాతారావు, అప్పలస్వామి పాల్గొన్నారు.

ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న లారీ డ్రైవర్లకు, హెవీ లైసెన్సు డ్రైవర్లకు ప్రభుత్వం రూ.15వేలు ఇవ్వాలని జయహో రథసారధి డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి వాసు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాను కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. ఆటో డ్రైవర్లనే కాకుండా హెవీ లైసెన్సు కలిగిన డ్రైవర్లను కూడా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. డ్రైవర్ సాధికార సంస్థ పెట్టి ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, విద్యా రుణాలు అమలు చేయాలన్నారు. సంఘ ప్రతినిధులు భూపతిరాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'అర్జీలను సత్వరం పరిష్కరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కార్పొరేషన్ అదనపు కమిషనరు కేటీ సుధాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్‌లో ఇద్దరు పౌరులు తమ సమస్యలను తెలియజేశారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఆయన ప్రజల నుంచి 14 అర్జీలు స్వీకరించారు. ఎస్ఈ పి.వెంక్రటావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈలు కామేశ్వరరావు, మాచిరాజు, ఏసీపీ శ్రీధర్, మేనేజరు సీతారాం, అకౌంటెంట్ రామశాస్త్రి పాల్గొన్నారు.

'పాడా' పీజీఆర్ఎస్‌కు 38 అర్జీలు

పిఠాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వివిధ శాఖలకు సంబంధించి ప్రజల నుంచి 38 అర్జీలు అందాయి. వీటిని సత్వరం పరిశీలించి పరిష్కరించాలని ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాలరావు అధికారులను ఆదేశించారు. ఏపీడీ వసంతమాధవి, తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అవతార్, డైనోసార్ వంటి అబ్బురపరిచే సెట్టింగ్‌లతో నగరంలోని ఆనందభారతి మైదానంలో తొలిసారిగా ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ తోట సుధీర్, టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ జిల్లా చైర్మన్ వనమాడి మోహనవర్మ, టీడీపీ కాకినాడ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు సోమవారం సాయంత్రం ప్రారంభించారు. నిర్వాహకుడు మధు, టీడీపీ నాయకులు తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, జనసేన నాయకులు వీవీ స్వామి, బడే గోవిందు, గోవిందరాజులు, అట్ల సత్యనారాయణ, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూథరన్ చర్చి 56వ వార్షికోత్సవం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట శివారు గైగోలుపాడు లూథరన్ చర్చి 56వ వార్షికోత్సవాన్ని అధ్యక్షుడు కొంగు శామ్యూల్‌రాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు రెవరెండ్ కె.ప్రసంగి, కె.అనిల్‌జాన్సన్, దాసరి మధుకిషోర్, గాబ్రియల్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. 1969 సెప్టెంబరు 19న ప్రారంభించిన చర్చిని 1971లో క్రిస్టియన్ క్యాన్సర్ ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ విలియం ప్రసాద్ అభివృద్ధి చేశారన్నారు. సెక్రటరీ బి.డేవిడ్, కె.అనిల్‌జాన్సన్, సంపత్‌కుమార్, లాజరు, దాసరి అగస్టిన్, జగన్నాథరావు, కాకినాడ సిటీ, రూరల్‌లకు చెందిన వివిధ సంఘాల చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధవహించాలి

ఏలేశ్వరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో రవి కుమార్‌వర్మ సూచించారు. సోమవారం యర్రవరంలో స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతి విభాగం కన్వీనర్ బసా ప్రసాద్, సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, షైరాల కనకారావు, వైద్యులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఘనంగా దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం



రాజవొమ్మంగిలో కొలువుదీరిన అమ్మవారు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి, జడ్డంగిలో దేవీ నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భవానీ మాలధారులు ఊరేగింపుగా అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అలాగే కన్నయమ్మపేట, దూసరిపాము, జడ్డంగి ఆలయాలు, పల్లివారివీధిలో మండపాల వద్ద జనం ప్రత్యేక పూజలు చేశారు.

మోతుగూడెం: మోతుగూడెంలోని దుర్గామాత ఆలయంలో సోమవారం దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు బాలా త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారిని పూజించారు. మొదటి పూజను సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు దంపతులు ప్రారంభించారు. అనం తరం మధ్యాహ్నం జాజుల రత్నా కర్ దంపతులు అన్నదానం నిర్వహించారు సాయంత్రం ఏడుగంటలకు మహిళలచే లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, సీనియర్ అకౌంటు ఆఫీసర్ వరప్రసాద్, ఏడిఈ కొండబాబు, శ్రీ లక్ష్మీగణపతి యూత్, శ్రీ లక్ష్మీగణపతి ఆలయ కమిటీ సభ్యులు. మహిళలు భవానీలు, తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: చింతూరు అమ్మవారి సన్నిధిలో శరన్నవరాత్రులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ భక్తులు పాల్గొని పూజలు చేశారు.

వై.రామవరం: మండలంలో దేవీ శరన్నవరాత్రులు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. సంతమార్కెట్ వీధిలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో వేకువజామున అమ్మవారి ప్రతిరూపాన్ని అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. చాకలి వీధి, చవిటి దిబ్బలులోనూ అమ్మవార్లకు పూజలు జరిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, ఉత్సవ నిర్వహకులు గుద్దేటి సుబ్రహ్మణ్యం, ఎలిదిండి వీరబాబు, గొర్లె శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా బతుకమ్మ సంబరాలు

ఎటపాక,సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విలీన మండలాల్లోని పలు గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు సందడిగా కొనసాగుతున్నాయి. ప్రతిఏటా దసరాను పురస్కరించుకుని మహిళలు, యువతులు పదిరోజుల పాటు ఈ సంబరాలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో వివిధరకాల పూలతో బతుకమ్మలను సిద్ధం చేసి ఆటపాటలతో మహిళలు, చిన్నారులు సందడి చేస్తుంటారు. రెండోరోజు సోమవారం అటుకుల బతుకమ్మను వివిధ రకాల పూలతో తయారు చేశారు.

మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

దేవీపట్నం, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): శరభవరం సచివాలయంలో సోమవారం స్వస్తి నారీ సశక్త్ పరివార్ అభియాన్ ద్వారా మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించారు. మండల వైసీపీ యూత్ కన్వీనర్, శరభవరం దేవారం ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వైద్యసేవలను సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఇందుకూరుపేట డాక్టర్, ఆశవర్కర్స్ 104, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విచారణపై హర్షం

కూనవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూనవరం పంచాయతీపై అధికారులు విచారణకు ముందు రావడం హర్షణీయమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను అన్నారు. దీనిపై తాను గతంలో విలేకరుల సమావేశంలో నిర్వహించడం జరిగిందని, దీనిపై స్పందించిన అధికారులు ఈనెల 24న విచారణకు వస్తున్నారన్నారు. అధికారులు నిజాయితీగా విచారణ నిర్వహించాలన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం






తొండంగి: ఏవీనగరంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, శంఖవరంలో బోనాలు ఇస్తున్న భక్తులు, ఏలేశ్వరంలో దుర్గాదేవి, తుని: టి.గవరపేటలో విజయదుర్గమ్మ

ఏలేశ్వరం, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏలేశ్వరం పట్టణ, మండలంలోని గ్రామాల్లో సోమవారం అమ్మవారి విగ్రహాలను వీధుల్లో వాహనాలపై ఊరేగించి ప్రతిష్ఠించారు. ఏలేశ్వరం సువ్వయ్యమ్మపేట, దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయం, జేవీఆర్ ట్రస్ట్ చైర్మన్ జువ్విన వీర్రాజు, రాఘవమ్మ దంపతులతో లింగవరం కాలనీలో నిర్వహించిన ఉత్సవాలకు కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్ అమ్మవారి విగ్రహాన్ని కమిటీకి అందజేశారు. చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మూది నారాయణ స్వామి, కౌన్సిలర్ అలమండ చలమయ్య, మాజీ కౌన్సిలర్లు సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రత్తిపాడు,(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రత్తిపాడులో మంగళవాయిద్యాలు, బోనాల జాతర ప్రదర్శనతో అమ్మవారి ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రాచపల్లిలోని అపీత కుచాంబ అమ్మవారిని మొదటి రోజు బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అరుణాచలేశ్వరునికి పలు రకాల పండ్ల రకాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. బసవేశ్వరునికి పంచ హారతులు ఇచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు రమణానంద స్వామి ఆధ్వర్యంలో ఎల్.తాతాజీ, కారె రామచంద్ర, జగ్గా త్రిమూర్తులు, వేదపండితులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

విద్యుత్ దీపాలతో ఆలయాలు అలంకరణ

తొండంగి,(ఆంధ్రజ్యోతి): ఏవీనగరంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు చరణ్‌శర్మ, మిశ్రా శాస్త్రోక్తంగా కలశస్థాపన చేశారు. అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి, టీడీపీ సీనియర్ నేత యనమల నాగేశ్వరరావు, భవానీ భక్తులు పూజల్లో పాల్గొన్నారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారు గాయత్రీదేవి, అన్నపూర్ణాదేవి, లలితాత్రిపుర సుందరీదేవి, మహాలక్ష్మిదేవి, సరస్వతీదేవి, దుర్గాదేవి, మహిషాసురమర్ధని, రాజరాజేశ్వరి దేవిగా భక్తులను అనుగ్రహించనున్నారు. ఈనెల29న సరస్వతీపూజ, మహాన్నదానం, అక్టోబరు 2న శమీపూజ నిర్వహించనున్నారు. ఈకార్యక్రమాల్లో యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య దంపతులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల సందర్భంగా శంఖవరంలో బోనాల ఉత్సవం జరిగింది. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భవానీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీలింగ్ భూమిని పేదలకు కేటాయించాలి

గండేపల్లి, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):జెడ్.రాగంపేట రెవెన్యూ గ్రామ పరిధిలోని సీలింగ్ భూమిని జెడ్.రాగంపేట, నీలాద్రిరావుపేట గ్రామాల్లో ఇళ్లు లేని దళిత, ఇతర పేదలకు స్థలాలుగా కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహశీల్దార్‌కి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీ ఆర్‌సీఎస్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, జిల్లా నాయకుడు కర్నాకుల రామలింగేశ్వరరావు, ఏఐఎఫ్‌టూయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూవీ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, డొక్కులూరి సంగీత పాల్గొన్నారు.

వీఆర్ఏల సంఘం ఉపాధ్యక్షుడిగా చిట్టిబాబు



జగ్గంపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం డివిజన్ వీఆర్ఏల సంఘం ఉపాధ్యక్షుడిగా జగ్గంపేటకు చెందిన వీఆర్ఏ వారా చిట్టిబాబు ఎన్నికయ్యారు. చిట్టిబాబుకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

సమష్టిగా పనిచేస్తే సత్ఫలితాలు: యనమల



టీడీపీలో చేరినవారితో యనమల రామకృష్ణుడు

తుని రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి సమష్టిగా పని చేస్తే సత్ఫలితాలు వస్తాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో కోటనందూరు మండలం భీమవరపు కోటకు చెందిన వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీ గ్రామ నాయకుడు పెంటకోట భాస్కర సత్యనారాయణ ఆధ్వర్యంలో యనమల సమక్షంలో టీడీపీలోకి చేరారు. వారికి యనమల పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి టీడీపీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. టీడీపీలోకి చేరినవారిలో ఆరుగుల అప్పారావు, రావాడ మరిడయ్య, కొత్తపల్లి రామకృష్ణ, 9వ వార్డుమెంబర్ ఆరుగుల అప్పారావు, మేఘన, వరలక్ష్మి, మణిబాబు, సుందర్‌కుమార్, లోవరాజుతో పాటు తదితరులుఉన్నారు. టీడీపీ నాయకులు గాడి రాజబాబు, పోతల సూరిబాబు, మేడపు రెడ్డి జోగిబాబు, ముక్కుపల్లి ఆనంద్, పృథ్వీరాజ్, ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

తుమ్మలపల్లి పూజలు

కిర్లంపూడి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురంలో కనకదుర్గ ఆలయంలో జన సేన పార్టీ జగ్గంపేట ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గిరిజన భూములకు రక్షణ కల్పించాలి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం పొదురుపాకలో గిరిజన భూములకు రక్షణ కల్పించాలని సోమవారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్, అఖిత భారత ఆదివాసీ సంఘం కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. పొదురుపాక గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో లిబరేషన్, గిరిజన సంఘ నాయకులు మానుకొండ లచ్చబాబు, రేచుకట్ల సింహాచలం, అడ్డాల వెంకట్రావు, చీడిపల్లి బాబ్జి, ఇరటాకృష్ణ, జగ్గంపూడి రాజబాబు, ఇరటా నాగసూరి పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దాసం శేషారావు కోరారు. ధర్మవరం ప్రతిభా విద్యాలయంలో సోమవారం స్టూడెంట్ లెడ్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శేషారావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడిక, ప్రవర్తన కలిగి ఉండడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. లీడ్ సీఎస్ఎంఎం విజయ్, లెర్న్ అకాడమీ మేనేజర్ వియ్యపురాజులు, ఏవో నాగేశ్వరరావు, హెచ్ఎం సత్యనారాయణ, కో ఆర్డినేటర్ రాణి, ప్రైమరీ ఇన్‌చార్జ్ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యోతుల నవీన్ పూజలు



జగ్గంపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జగ్గం పేట శెట్టిబలిజ కాలనీలోని దేవీ మండపాన్ని, పద్మనాభ నగర్ చెరువు గట్టుపై కనకదుర్గ మండపాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, నీలం శ్రీను, వెలిశెట్టి శ్రీను, రాయి సాయి, సంగిరెడ్డి రమేష్, గొర్రెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న రమేష్

రాజుపాలెం-రామవరం రోడ్డుకు మరమ్మతులు

కిర్లంపూడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం గ్రామం నుంచి జగ్గంపేట మండలం రామవరం గ్రామం వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ సొంత నిధులతో రామచంద్రపురం శివారు నుంచి తామరాడ బ్రిడ్జి వరకు మరమ్మతులు చేయిస్తున్నారు. రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌తో మాట్లాడతానన్నారు. గ్రామస్తులు, ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణులకు వైద్య సేవలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గీతా సుధ, జీజీహెచ్ ప్రసూతి నిపుణురాలు డాక్టర్ కృష్ణవేణి గర్భిణులకు వైద్య సేవలు అందించారు. ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు అధికారి పద్మావతి పౌష్టికాహార ఆవశ్యకత వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వెలుగుల నాని, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి వెంకటరత్నం, కూటమి నాయకులు సింగిలిదేవ్ సత్తిరాజు, మదినే దొరబాబు, గ్రామ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం కాట్రావులపల్లికి చెందిన బిక్కిన శేషగిరిరావు (బాబి) ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథిగా హాజరై పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, ముసిరెడ్డి నాగేశ్వరరావు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, కంటే రామారావు, పీలా మహేష్, వెలిశెట్టి శ్రీను, రాయి సాయి, వేములకొండ జోగారావు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 98 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న పీవో స్మరణ్‌రాజ్

రంపచోడవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రాజెక్ట్ అధికారి స్మరణ్‌రాజ్, సబ్ కలెక్టర్ శుభం నక్వాల్, ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య ప్రజల నుంచి 98 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రోడ్లు ఏర్పాటుచేయాలని, తాగునీరు అందించాలని, దివ్యాంగులకు వాహనాలు మంజూరు చేయాలని కోరుతూ అర్జీలు అందాయన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, డీఎల్డీవో కె.కోటేశ్వరరావు, పీహెచ్‌వో దేవదానం, ఏడీఏ సావిత్రి, జీసీసీ డీఎం జయశ్రీ, ఏడీఎంహెచ్‌వో డేవిడ్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' సామాజిక తనిఖీ బృందం సమీక్ష

వై.రామవరం, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో బాపన్నదొర ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బృందం సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి న పనుల నిర్వహణ, జమాఖర్చులు మొదలుగు అంశాలపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఎస్ఆర్‌పీ అత్యుత్, ఏపీవో సాయిబాబా, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

'తక్షణమే రోడ్లు ఏర్పాటు చేయాలి'

రంపచోడవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో తక్షణమే రోడ్లు చేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్ అన్నారు. ఈ మేరకు సీపీఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఏడు మండలాల్లోని చాలా గ్రామాల్లో రోడ్లు లేక ప్రజలు వర్షాకా లం, అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పులసుమామిడి-మునగనపూడి, బూరుగుపాలెం-చందుర్తి రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యురాలు గోము దుర్గ, దమదాల కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆయా గామాల ప్రజలు పాల్గొన్నారు.

రేపు రంపచోడవరంలో ఆధార్ ప్రత్యేక శిబిరం

● ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్

రంపచోడవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో బుధవారం ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకొనేందుకు ప్రత్యేక ఆధార్ గ్రీవెన్స్ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ తెలిపారు. ఆధార్ కార్డుల్లో పేరు, తల్లిదండ్రుల పేరు, జనన తేదీ, లింగం వివరాలను సవరించుకోవచ్చునని తెలిపారు. మండలంలోని గ్రామాల ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరానికి వచ్చేవారికి తాగునీరు, తదితర సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల హర్షం

ఏలేశ్వరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్సూరెన్సు పాలసీలపై జీఎస్టీని తొలగించడంపై స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో ఏజెంట్లు సోమవారం సంబరాలు చేసుకున్నారు. గోకవరం బ్రాంచ్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కోరుకొండ నూకరాజు నేతృత్వంలో కేక్ కట్ చేసి పంచారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోళ్ల నాగేశ్వరరావు, పలివెల శివాజీ, గొంతిరెడ్డి సతీష్, కొత్త నాగేశ్వరరావు, మాగంటి సూరిబాబు పాల్గొన్నారు.

డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన

జగ్గంపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గోవిందపురంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.38లక్షలతో మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణానికి సోమవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కమ్మిల వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహిం చిన సభలో నవీన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం అందించడం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వల్లే సాధ్యమన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, పైడిపాల సూరిబాబు, బుర్రి సత్తిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, దేవరపల్లి మూర్తి, రేఖ బుల్లి రాజు, నీలం శ్రీను, పాండ్రంగి రాంబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, ఎంపీటీసీ సామిదాల జానకి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గండేపల్లి ఏవో

జగ్గంపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండల వ్యవసాయ అధికారిణి జె.లక్ష్మి సోమవారం జగ్గంపేట రావులమ్మనగర్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో ఉంటానని ఆమె తెలిపారు.

'ఆదిత్య'లో వర్క్‌షాప్ ప్రారంభం

గండేపల్లి, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో, ఇగ్నైట్ ఎంబెడెడ్ సిస్టమ్స్ సహకారంతో జెన్ ఏఐపై ఆరు రోజుల వర్క్ షాప్ ప్రారంభించినట్టు డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వర్క్‌షాప్ ఈనెల27వరకు జరుగుతుందన్నారు.